ప్రజాశక్తి
ఆదివారం 25 జూన్ 2023 5
శ్రీ సత్యసాయి





వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పి.అరుణ్‌బాబు

రీ సర్వే లక్ష్యాన్ని చేరుకోవాలి

కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రీ సర్వేలో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేసేందుకు అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా॥కెఎస్.జవహర్ రెడ్డి కలెక్టర్ పి.అరుణ్ బాబు వివరించారు. విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుంచి శనివారం నాడు జగనన్న భూహక్కు, రీసర్వే, ప్రయారిటీ భవనాలు, జగనున్నకు చెబుదాం తదితర అంశాలపై కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పుట్టపర్తి కలెక్టరేట్ స్పందన వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఈ సమీక్షలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, డిఆర్ఒ కొండయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద జిల్లాలో రీసర్వే చేపట్టిన గ్రామాల్లో వేగవంతంగా పనులు చేపడుతున్నామన్నారు. రీ సర్వే చేపట్టిన కొన్ని గ్రామాల్లో 10, 12 వేల ఎకరాల వరకు భూములు ఉన్నాయని, కర్ణాటక రాష్ట్రానికి అనుకుని ఉన్న గ్రామాల్లో రైతులు వలసలు వెళ్లడంతో వారిని తిరిగి పిలిపించి హద్దులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో లక్ష్యానికి అనుగుణంగా రీసర్వే ప్రక్రియను పూర్తి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకష్ణ, పిఆర్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, డిఎంహెచ్ఒ డా॥కృష్ణారెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు చర్యలు

జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం కింద జిల్లాలో ఈ నెల 26 నుంచి జులై 16వ తేదీ వరకు చేపడుతున్న కుష్టు వ్యాధి నిర్ధారణ అవగాహన కార్యక్రమాన్ని బాధ్యతగా చేపట్టాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు వైద్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్పందన వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో కుష్టువ్యాధి నిర్ధారణ అవగాహన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను డిఆర్ఒ కొండయ్యతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి గుర్తింపు కోసం ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ఈనెల 26 నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైద్య శాఖ ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు గహ సందర్శన చేసి కుష్టు వ్యాధి లక్షణాలపై స్వీయ పరీక్ష చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి లక్షణాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా చికిత్సలు అందించి మందులు అందజేస్తారన్న విషయాన్ని వారికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్ఒ డా॥ఎస్‌వి.కృష్ణారెడ్డి, డిఎల్ఎటి తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



చిరువ్యాపారులకు షాక్..!

- వంద శాతం వరకు పెరిగిన విద్యుత్ ఛార్జీలు
- తొమ్మిది నెలలకు రూ.180 కోట్ల వరకు అదనపు భారం
- అన్ని తరగతుల ప్రజలపై బిల్లుల భారం

మూలిగే నక్కపై తాటికాయపడ్డ చందంగా మారింది చిరు వ్యాపారుల పరిస్థితి. కోవిడ్ సమయం నుంచి ఇప్పటికీ వ్యాపారాలు ముందున్న స్థాయికి చేరుకోలేదు. అసలే వ్యాపారాలు తగ్గి ఇబ్బందులు పడుతున్న సమయంలో ఇప్పుడు ప్రభుత్వం వేస్తున్న విద్యుత్ ఛార్జీల భారం మరింత కుంగదీసేలా మారింది. ట్రూ అప్, సర్‌ఛార్జీల పేరుతో గతంలో వచ్చే దానికంటే వంద శాతం అధికంగా బిల్లులు వస్తుండటంతో ఏమి చేయాలో పాలుపోని ఆందోళన స్థితిలో చిరువ్యాపారులు, వినియోగదారులు పడ్డారు. అన్ని కేటగిరీలపైనా ఈ అదనపు భారాలు పడ్డాయి. గృహాలు, వ్యాపార సముదాయాలు, పరిశ్రమలు అన్నింటికీ ట్రూ అప్, సర్‌ఛార్జీల భారం పడుతోంది. యూనిట్ పై ట్రూఫ్ అప్ ఛార్జీ పేరుతో 23 పైసలు, సర్‌ఛార్జీ కింద 40 పైసలు ఇలా రెండు రకాలుగానూ వినియోగదారుడిపై బాదుడు పడుతోంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో 12.99 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో హెచ్‌టి సర్వీసులు (భారీ పరిశ్రమలు) 817 ఉన్నాయి. ఎల్‌టి కింద నెలకు రూ.92.97 కోట్లు కాగా, జూన్ నెలలో వేసిన బిల్లులు రూ.102.46 కోట్లు. అంటే నెలకు ఎల్ సర్వీసుల ద్వారా అదనంగా వినియోగదారులపై పడిన భారం రూ.9.49 కోట్లు, అదే హెచ్‌టి కింద నెలకు రూ.200.22 కోట్లకుగానూ, రూ.211.18 కోట్లు అదనపు ఛార్జీలు వేశారు. అంటే దీనిపై అదనంగా రూ.10.98 కోట్లు భారం పడింది. ఈ లెక్కన ఒక్క నెలకు రూ.20కోట్లు అదనంగా ఛార్జీలు పెరిగాయి. వీటన్నింటి పరిధిలో నెలకు సగటున రూ.20 కోట్ల వరకు అదనపు భారం ప్రజలపై పడనుంది. ఈ పెంపుదల వచ్చే మార్చి వరకు వరకు అంటే తొమ్మిది మాసాల వరకు ఉండనుంది. మొత్తం ఉమ్మడి జిల్లాపై రూ.180 కోట్లకుపైగా అదనపు భారం పడనుంది.

విద్యుత్ బిల్లులు దాదాపు రెండింతలు

అంతకు మునుపు నెలకు సగటున రూ.450 వరకు కరెంటు బిల్లు వచ్చేది. ఈ నెల ఏకంగా రూ.825 వచ్చింది. దాదాపు రెండింతలు పెరిగింది. ఇంటిది అలాగే పెరిగింది. నెలకు రూ.150 వచ్చేది, ఈసారి రూ.350కు పెరిగింది. అసలే వ్యాపారాల్లేవు. ఇప్పటికే గ్యాస్, టీ పొడి, పాల ధరలు పెరిగాయి. మరోవైపు కోవిడ్ సమయం నుంచి వ్యాపారాలు ముందులాగా జరగడం లేదు. ఇప్పుడు కరెంటు బిల్లుల భారం ఇంత పెద్దఎత్తున వేస్తే సామన్యుడు బతికేదెట్టా...పెరుగుతున్న ధరలకు తగ్గట్టు వ్యాపారాలు పెరగడం లేదు. చాలా ఇబ్బందికరంగా మారింది.

నిస్సార్, టీ షాపు నిర్వాహకుడు, అనంతపురం నగరం.

షాపు బిల్లు... ఇంటి బిల్లు రెండూ పెరిగాయి

జిరాక్స్ కేంద్రం నడవాలంటే తప్పకుండా కరెంటుతోనే పని. ఒకవైపు కరెంటు బిల్లులు క్రమక్రమంగా పెరుగుతూనే ఉన్నాయి. పోయిన నెల వరకు కరెంటు బిల్లు నెలకు రూ.1500 వరకు వచ్చేది. ఈ నెల అది ఏకంగా రూ.2500 పెరిగింది. ఇంటి కరెంటు బిల్లు కూడా అదే రకంగా రెండింతలు పెరిగింది. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామంటూ ఈ రకమైన భారాలు పరోక్షంగా ప్రజలపై వేయడం సరైంది కాదు. ఇప్పుడు పెరిగిన భారం ఈ ఒక్క నెలే అనుకుంటే కాదు.. మార్చి వరకు ఇదే రకంగా ఉంటాయని అంటున్నారు.

రామాంజినేయులు, జిరాక్స్ కేంద్రం నిర్వాహకుడు.

వచ్చే ఆదాయం కరెంటు బిల్లుకే సరిపోయేలాగుంది..

నెలనెలా ఇంటికీ, పిండిమిషన్ కలిపి మొత్తం రూ.3000 వరకు బిల్లు వచ్చేది. కాని ఈ నెల ఏకంగా రూ.8 వేలు కరెంటు బిల్లు వచ్చింది. ఇంత పెద్దఎత్తున ఎందుకు పెరిగిందంటే అధికారులెవరూ ఏమి సమాధానం చెప్పరు. మా చేతుల్లో ఏమీ లేదని అంటున్నారు. పిండిమిషన్‌కు వచ్చి పిండి పట్టించుకునే వారే తగ్గిపోతున్నారు. ఆదాయం బాగా తగ్గిపోతున్న సమయంలో ఇప్పుడు ప్రభుత్వం ఇటువంటి భారలు మోపడం మరింత ఇబ్బందికరంగా మారుతోంది. పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణం తగ్గించాలి.

మహమ్మద్ అలీ, పిండిమిషన్ నిర్వాహకుడు.

నేరాల నియంత్రణపై దృష్టి

కేసుల దర్యాప్తులో వేగం పెరగాలి
అనంతపురం రేంజ్ డిఐజి ఆర్ఎస్.అమ్మిరెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్



డీఎస్పీలతో సమీక్ష నిర్వహిస్తున్న డిఐజి

నేరాల నియంత్రణపై ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో ఎస్ఐలు, సిఐలు పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని అనంతపురం రేంజ్ డిఐజి ఆర్ఎస్.అమ్మిరెడ్డి సూచించారు. జిల్లా నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని శనివారం నాడు ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా డిఐజి జిల్లాలో నేరాలు, వాటి నియంత్రణకు తీసుకున్న చర్యలపై సమగ్రంగా చర్చించారు. జిల్లాలో ప్రతి స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్స్‌పై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. క్రమం తప్పకుండా వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో తరచూ ప్రమాదాలు జరిగే రహదారులను గుర్తించి అక్కడ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్పెషల్, లోకల్ చట్టాలపై పోలీస్ సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లా పరిధిలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పీస్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిధిలోని డిఎస్పీలు, పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు ప్రభుత్వ సాయం

ప్రజాశక్తి-హిందూపురం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రమోద్ కుమార్

మున్సిపాలిటీలో గృహాలు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేసుకోవాడానికి ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ కోరారు. ఆయన శనివారం కొట్నూరు జగనన్న లే అవుట్‌ను పరిశీలించారునప. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ మొత్తం 6,775 గృహాలకు గానూ 426 ఇళ్లు పూర్తి కాగా కొందరు గృహ ప్రవేశాలు చేశారన్నారు. ప్రభుత్వం రూ. 1.80 లక్షలు ఇవ్వడంతో పాటు అదనంగా మెప్మా ద్వారా రూ. 35 వేలు మంజూరు చేస్తుందని, ఈ నిధులతో గడువులోగా పూర్తి చేసుకోవాలన్నారు. లే అవుట్‌లో మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఆయన వెంట అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, హౌసింగ్ డిఈఈ శివకుమార్ నాయక్, ఎఈ ఫణి రాజ్, మెప్మా సిఎంఎం హరినాథ్ రెడ్డి, అమ్యూనిటీ సెక్రటరీలు ఉన్నారు.



రోడ్డు ప్రమాదంలో నుజ్జు నుజ్జైన కారు, బొలేరో వాహనం

టేకులోడు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి-చిలమత్తూరు

చిలమత్తూరు మండల పరిధిలోని టేకులోడు క్రాస్ (544-ఈ)శిరా జాతీయ రహదారిపై శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు మతి చెందారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... పార్చునర్ కారు కొడికొండ చెక్‌పోస్టు వైపు నుంచి హిందూపురం వెళ్తోంది. అదే సమయంలో హిందూపురం వైపు నుంచి బొలేరో వాహనం చిలమత్తూరు వైపు నుంచి టేకులోడు క్రాస్‌కు మళ్లింది. ఈ సమయంలో రెండు వాహనాలు ఒకదానితో ఒకటి వేగంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో బొలేరో వాహనంలో ప్రయాణిస్తున్న పాతచామలపల్లి గ్రామానికి చెందిన కొత్తిమీర వ్యాపారి మధు(25) అక్కడికక్కడే మతి చెందాడు. మరో వ్యక్తి శంకర్ రెడ్డి(55) తీవ్రంగా గాయపడ్డాడు. ఈయన్న చికిత్స నిమిత్తం హిందూపురం ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇదే ప్రమాదంలో ఆనంద్ నాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పార్చునర్ కారులో ఉన్నాయి నలుగురు కూడా గాయపడ్డారు. ప్రమాదం జరిగినపుడు కార్లో బెలున్‌లు తెరుచుకోవడంతో ప్రాణనష్టం తగ్గినట్లు తెలుస్తోంది. గాయపడిన వెంకటేష్, పుష్పవతి, నారాయణరెడ్డి, సోములను 108 వాహణంలో హిందూపురం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో మృతి చెందిన మధుకు బార్యా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరిలో పదిరోజుల కూతురు ఉంది. ఒకే గ్రామంలో ఇద్దరు మతి చెందడంతో పాతచామలపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసిపి పాలనలో సొంతింటి కల సాకారం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

అర్హత ఉన్న ప్రతి నిరుపేదలకు సొంతింటి కలను వైసిపి ప్రభుత్వం నిజం చేస్తోందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి పేర్కొన్నారు. శనివారం నాడు పోతులనాగేపల్లి లేఅవుట్లో గృహ నిర్మాణ లబ్ధిదారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఛైర్‌పర్సన్‌తో పాటు హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, వైస్ ఛైర్మెన్ యర్రగుంట్ల భాగ్యలక్ష్మి, హౌసింగ్ ఈఈ చంద్రశేఖర్, డీఈ మునిశ్వరనాయుడు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాన్ని ప్రారంభించి నేటికి ఎనిమిది సంవత్సరాలు అయ్యిందన్నారు. ఈ సందర్భంగా సొంతింటిని నిర్మించుకున్న లబ్ధిదారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకుంటున్నట్లు తెలిపారు. జగన్న లేఅవుట్లో నిర్మాణాలకు అవసరమైన అన్ని వసతులనూ కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం నిర్మాణాలు పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీధర్, హౌసింగ్ ఏఈ బాలాజీ, విద్యుత్ శాఖ ఏఈ జానకి రామయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

చెత్తపన్ను వసూళ్ల నుంచి విముక్తి కల్పించండి

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం చెత్త పన్ను వసూళ్ల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని వార్డ్ పర్యావరణ పారిశుధ్య కార్యదర్శులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కదిరి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగులపై రాష్ట్రంలో ప్రతి రోజూ ఏదో ఒక చోట ఉన్నత స్థాయి ఉద్యోగులు వేదింపులకు గురిచేస్తున్నారని చెప్పారు. వార్డు పర్యావరణ, పారిశుధ్య కార్యదర్శులను సచివాలయం ఉద్యోగులుగా గుర్తించి, వారికి ఇతర సచివాలయ సిబ్బంది లాగే సమయపాలన అమలు చేయాలన్నారు. విశాఖపట్నంలో చెత్త పన్ను వసూళ్లు తక్కువ చేశారనే నెపంతో పదిమంది పర్యావరణ, పారిశుధ్య కార్యదర్శులను విధుల నుంచి సస్పెండ్ చేయడం సరికాదన్నారు. తక్షణం వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

కొత్తచెరువు : బాల్యవివాహాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఐసిడిఎస్ పిడి కృష్ణకుమారి జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శివ రంగ ప్రసాద్ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివా రం మండల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా పోలీసులతో అవగాహన సద స్సు నిర్వహించారు. ముందుగా పోస్టర్లను ఆవిష్కరించి పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. అంగనవాడీ కేంద్రాల్లో అక్రమాలను ఉపేక్షించబోమన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రామాంజనేయరెడ్డి ఎంపిడిఒ సిద్ధారెడ్డి, ఐసిడిఎస్ సిడిపిఓ గాయత్రి, హౌసింగ్ ఏఈ రమణారెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచి రాధా, జడ్పిటిసి గంగాదేవి, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

టిడిపి బస్సుయాత్రతో వైసిపిలో వణుకు

కనగానపల్లి : టిడిపి బస్సు యాత్ర మొదలు కాగానే వైసిపి నాయకుల్లో వణుకు పుట్టిందని మాజీ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. రామగిరి మండల పరిధిలోని వెంకటాపురంలో శనివారం ఆమె తన నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. బస్సు యాత్ర ఈ నెల 26వ తేదీ రాప్తాడు నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందని తెలిపారు. ఒక రోజు జరిగే బస్సుయాత్రలో వైసిపి ప్రభుత్వ వైఫల్యాలు, టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధి, మేనిఫెస్టో గురించి వివరిస్తామని తెలిపారు. నాలుగేళ్లలో రాప్తాడు నియోజకవర్గం అభివృద్ధి పరంగా ఎంతో వెనుకబడిందని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, కన్వీనర్లు యాతం పోతలయ్య, సుధాకర్, సీనియర్ నాయకులు సుధాకర్ చౌదరి, బాల నరసింహులు, పూజారి రాజకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ లబ్ధి : ఎమ్మెల్సీ

హిందూపురం : రాష్ట్ర వ్యాప్తంగా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని ముఖ్యమంత్రి జగనన్న సురక్ష పథకం తీసుకొచ్చారని నియోజక వర్గ ఇన్‌ఛార్జి షేక్ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. పట్టణంలోని 19వ వార్డులో శనివారం చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఇక్బాల్‌కు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజతో పాటు వార్డు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, వైస్ ఛైర్మన్ జబివుల్లా, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు లోకేష్, కౌన్సిలర్లు నాగేంద్రబాబు, మల్లికార్జున, రహమత్‌బి, అయూబ్, రోషన్ అలీ, బాబు, వెంకటేష్ రెడ్డి, మున్సిపల్ అధికారులు, సచివాలయ కన్వీనర్, గృహ సారథులు పాల్గొన్నారు.

వైసిపిని తరిమేస్తేనే రాష్ట్రాభివృద్ధి

- రాష్ట్ర భవిష్యత్తుకు టిడిపి భరోసా
- బస్సుయాత్రలో టిడిపి నాయకులు
- తెలుగుదేశం హయాంలో అభివృద్ధి పనులను చూపుతూ సెల్ఫీ ఛాలెంజ్‌లు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్, కదిరి అర్బన్, బుక్కపట్నం, కొత్తచెరువు

వైసిపిని అధికారం నుంచి తరిమేస్తేనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని టిడిపి నాయకులు పునరుద్ఘాటించారు. టిడిపి 'భవిష్యత్తుకు గ్యారెంటీ' పేరుతో చేపట్టిన బస్సుయాత్ర శనివారం నాడు పుట్టపర్తి నియోజకవర్గంలోకి చేరింది. బడవాండ్లపల్లి, బాసంవారిపల్లి, అరవాండ్లపల్లి, చెర్లోపల్లి, వెంగలమ్మ చెరువు తదితర గ్రామాల్లో యాత్ర సాగింది. మాజీ మంత్రులు పల్లె రఘునాథ్ రెడ్డి, కాల్వ శ్రీనివాసులు, పరిటాల సునీత, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్యేలు పార్థసారథి, కంది కుంటా వెంకట ప్రసాద్, ఉన్నం హనుమంతరాయ చౌదరి, నాయకులు బిటి.నాయుడు, మాజీ ఎమ్మెల్సీలు తిప్పేస్వామి, బచ్చల పుల్లయ్య, ఉమామహేశ్వర నాయుడు, పర్వీన్‌భాను, టీడీపీ బిసి సెల్ నాయకులు అంబికా లక్ష్మీనారాయణ, రంగయ్య, జెరిపిటి నరసింహులు, సామకోటి ఆదినారాయణ ,రవీంద్ర తదితరులు ఈ యాత్రలో పాల్గొన్నారు. వీరజిన్నయ్యపల్లి, కర్నాటక నాగేపల్లి వద్ద టిడిపి హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు, కర్ణాటకనాగేపల్లి పుట్టపర్తి చిత్రావతి వద్ద నిర్మించిన చెక్‌డ్యామ్, బుక్కపట్నం చెరువు కట్టపై పైలాన్ ఆవిష్కరణ శిలాఫలకంను చూపిస్తూ టిడిపి నాయకులు సెల్ఫీ దిగారు. టిడిపి హయాంలో జరిగిన అభివద్ధి పనులు, సిసి రోడ్ల నిర్మాణం, మంచినీటి సరఫరా పైపులైన్ తదితర అభివద్ధి పనులకు బొగ్గలపల్లి వద్ద వేసిన శిలాఫలకాన్ని టిడిపి నాయకులు చూపిస్తూ వైసిపి నాయకులకు సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీలకు వెన్నుదన్ను టీడీపీ అన్నారు. రాష్ట్రంలో సైకో జగన్ పాలనతో ప్రజలు విసిగిపోయారని చెప్పారు. ఏపీ ప్రజల భవిష్యత్‌కు చంద్రబాబు గ్యారెంటీగా నిలుస్తారని చెప్పారు. మెజార్టీ ప్రజలు టీడీపీ అధికారంలోకి రావాలని కోరుకొంటున్నారని తెలిపారు. మహిళల రక్షణకు అండగా చంద్రబాబు పెద్దన్నయ్యగా నిలుస్తారని తెలిపారు. వైసీపీ పాలనలో ప్రజలపై అన్ని రకాల భారాలు పడుతున్నాయన్నారు. టిడిపి మహానాడు వేదికగా భవిష్యత్‌కు గ్యారెంటీతో ఆరు హామీలను చంద్రబాబు నాయుడు ప్రకటించారన్నారు. ఈ హామీలు ప్రజలకు భరోసాగా ఉంటాయన్నారు. చంద్రబాబు నాయుడు పూర్తి మేనిఫెస్టో ప్రకటిస్తే వైసీపీ ఉనికే ప్రమాదంలో పడుతుందన్నారు. బస్సు యాత్రకు పుట్టపర్తి నియోజకవర్గంలోని పలు గ్రామాల టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల టిడిపి కన్వీనర్లు రామాంజనేయులు, విజయకుమార్, మల్లిరెడ్డి, శ్రీనివాసులు, రామకృష్ణ, మైలే శంకర్, జయచంద్ర, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుట్టపర్తిలో బస్సుయాత్రలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు



కొత్తచెరువు బహిరంగసభలో ప్రసంగిస్తున్న పల్లె రఘునాథరెడ్డి

కదిరి అర్బన్ : టిడిపి జోన్-5 భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య బస్సుయాత్ర కదిరి నియోజకవర్గంలో శనివారం రెండవ రోజు కొనసాగింది. కదిరి టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆయా ప్రాంతాల్లో ఘనస్వాగతం పలికారు. బస్సుయాత్రలో భాగంగా టిడిపి హయాంలో జరిగిన అభివద్ధి పనులు, సిసి రోడ్ల నిర్మాణం, మంచినీటి సరఫరా పైపులైన్ తదితర అభివద్ధి పనుల శిలాఫలకాన్ని చూపెడుతూ వైసిపి నేతలకు టిడిపి నాయకులు సెల్ఫీ చాలెంజ్ విసిరారు. ఈ సందర్భంగా వైసిపి పాలనలపై నాయకులు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం టిడిపికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.

బుక్కపట్నం : టిడిపి ప్రభుత్వంతోనే యువత అన్ని విధాలా అభివద్ధి చెందుతుందని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్తు గ్యారెంటీ యాత్రలో భాగంగా మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివద్ధి సాధ్యం అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ యువతకు మూడు వేల రూపాయల నిరుద్యోగ భతి కల్పిస్తామని హామీ ఇచ్చారు పుట్టపర్తిలో స్థానిక ఎమ్మెల్యే ఇసుక దందా చేస్తున్నారని చెప్పారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి తన దందాలకే సమయం కేటాస్తున్నారని విమర్శించారు.

కొత్తచెరువు : వైసిపి ప్రభుత్వం దుర్మార్గపు పాలనకు ప్రజలు చమర గీతం పాడాలని కొత్తచెరువులో నాలుగు రోడ్ల కూడాలలో జరిగిన బహిరంగ సభలో టిడిపి నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. బస్సు యాత్ర పుట్టపర్తి నియోజకవర్గంలో నల్లమాడ లో ప్రారంభమై పుట్టపర్తి, బుక్కపట్నం మీదుగా కొత్తచెరువుకు రాత్రి 8 గంటలకు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో పాటు, టిడిపి పాలనపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ఎక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం జరిగినా, బిల్డింగులు కట్టినా ఎమ్మెల్యే డి శ్రీధర్ రెడ్డికి మామూళ్లు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇలాంటి పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు.

'జగనన్న సురక్ష' సర్వేను సమగ్రంగా నిర్వహించాలి : కలెక్టర్



రొళ్లలో 'జగనన్న సురక్ష'పై అవగాహన కల్పిస్తున్న ఎంపిపి కవిత, తదితరులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

'జగనన్న సురక్ష' సర్వేను సమగ్రంగా నిర్వహించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని నిడిమామిడి గ్రామంలో అధికారులు ఇంటింటికీ వెళ్లి చేస్తున్న సర్వేను శనివారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సర్వేలో అధికారు లు ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు మా ట్లాడుతూ గ్రామంలో 1,319 గృహాలు ఉండగా 213 ఇళ్లలో సర్వే పూర్తి చేసినట్లు కలెక్టర్‌కు వివరిం చారు. కలెక్టర్ వెంట ఆర్డిఒ భాగ్యరేఖ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మధులత, జిఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, పుట్టపర్తి తహశీల్దార్ నవీన్‌కుమార్, ఎంపిడిఒ అశోక్ కుమార్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, గృహసారథులు ఉన్నారు.

గోరంట్ల రూరల్ : 'జగనన్న సురక్ష' కార్యక్రమంపై శనివారం సచివాలయ కన్వీనర్ సమరసింహా రెడ్డి, ఎంఎల్ఓ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కమ్మవారిపల్లి, గౌనివారిపల్లి, మలసముద్రం, కొండాపురం సచివాలయాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచిలు ఆదినారాయణ, మణిశివశంకర్‌రెడ్డి, అనిత వెంకటరమణ, ఎంపిటిసిలు బాబురెడ్డి, చలమయ్యగారిపల్లి జయచంద్ర రెడ్డి, ఎముకలగుట్లపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు, వైసిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

హిందూపురం : మున్సిపాలిటీలో శనివారం నుంచి జగనన్న సురక్ష సర్వే ప్రారంభమైంది. తొలి రోజు సర్వేను మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి 3వ వార్డులో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సర్వేలో వాలంటీర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా సమగ్రంగా సర్వే చేపట్టాలని సూచించారు.

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని నిడిమామిడి గ్రామంలో శనివారం మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు 'జగనన్న సురక్ష' సర్వేను ప్రారంభించారు. ఇందులో భాగంగా వారు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ సుబ్బరాజు,ఎంపిపి రమణారెడ్డి, వైస్ ఎంపిపి రంగన్న, సర్పంచి లత, సచివాలయ కన్వీనర్ మల్లికార్జున, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం జగరాజుపల్లి జగనన్న కాలనీలో హౌసింగ్ అధికారులు, ఎంపిడిఒ అశోక్‌కుమార్‌రెడ్డి పర్యటించి గృహ లబ్ధిదారులతో పనుల పురోగతిపై చర్చించారు. పట్టా పొంది పనులు ప్రారంభించని వారి పట్టాలను రద్దు చేసి ఇతరులకు అందజేస్తామని తెలిపారు.

రొళ్ల : ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపిపి కవిత విజయరంగయ్యగౌడ్ తెలిపారు. మండల పరిధిలోని రొళ్ల గొల్లహట్టి గ్రామంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అలాగే అర్హత ఉండి పథకాలు అందని వారిని గుర్తించి సంక్షేమ పథకాలు అందించాలని వాలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆజాద్, ఈఓఆర్‌డి క్రిష్టప్ప, విఆర్ఒ వైకుంఠప్ప, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు హాజరయ్యారు.

టిడ్కో ఇళ్లు పూర్తి చేయాలి

టిడిపి నాయకులు కాలవ, పల్లె, పార్థసారథి



టిడ్కో గృహాల వద్ద టిడిపి నాయకుల సెల్ఫీ ఛాలెంజ్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పేదల కోసం టిడిపి హయాంలో చేపట్టిన టిడ్కో గృహాల నిర్మాణాలను పూర్తి చేసి వారికి ఇవ్వాలని మాజీ మంత్రులు కాలవ శ్రీనివాసులు, పల్లె రఘునాథ్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు బికె పార్థసారథి డిమాండ్ చేశారు. వారు శనివారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని కర్నాటక నాగేపల్లి వద్ద టిడిపి హయాంలో నిర్మించిన టిడ్కో గృహాల వద్ద సెల్ఫీ తీసి వైసిపికి సవాల్ విసిరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి హయాంలో దాదాపు 600 మంది పేదలకు టిడ్కో ఇళ్లను 80 శాతం పూర్తి చేసిందని, వైసిపి ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఇది చేతగాని దద్దమ్మ ప్రభుత్వమని విమర్శించారు. అనంతరం బుక్కపట్నానికి బస్సు యాత్రగా బయల్దేరి వెళ్లారు. కార్యక్రమంలో మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, నాయకులు ఉమామహేశ్వరరావు, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి:సవితమ్మ

పెనుకొండ : టిడిపి అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలా నాశనం చేసిన సీఎం జగన్‌రెడ్డిని ఇంటికి పంపుదామన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో నియోజకవర్గంలో జరిగే బస్సుయాత్రలో అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పా ల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణ, శ్రీరాములు యాదవ్, వెంకటరమణ, మాధవనాయుడు, వెంకటేష్, డివి ఆంజనేయులు, గుడిపల్లి రంగప్ప, చంద్రమౌళి, నరసింహా, సుబ్రహ్మణ్యం, త్రివేంద్రనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'భవిష్యత్తుకు గ్యారెంటీ' యాత్రను జయప్రదం చేద్దాం

టిడిపి అధినేత చంద్రబాబు చేపట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సు యాత్రను జయప్రదం చేద్దామని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం శశిభూష ణ్ నాయకులతో చర్చించా రు. పట్టణంలో ఆదివారం చేపట్టనున్న యాత్రలో పెద్దఎత్తున పాలొనాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు సిద్దయ్య, సిద్దలింగప్ప, పట్టణ కన్వీనర్ రవిశంకర్, రాష్ట్ర మైనారిటీ అధికార ప్రతినిధి హుజూర్, జిల్లా బోయ సాధికార కమిటీ సభ్యులు బోయ అనిల్ కుమార్, జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి జావేద్, నియోజకవర్గ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు రియాజ్ పాల్గొన్నారు.

చిరిగిన జాతీయ జెండా!



విద్యుత్ కార్యాలయం వేలాడుతున్న జెండా


గోరంట్ల రూరల్ : గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని గుమ్మయ్యగారిపల్లి వద్ద కదిరి-హిందూపురం ప్రధాన రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ కార్యాలయం ఆవరణలో జాతీయ జెండా దుమ్ము పట్టి చిరిగిపోయి వేలాడుతోంది. ఇది గమనించిన ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జాతీయ జెండాను కిందకు దించాలని స్థానికులు కోరుతున్నారు.



రొద్దంలో నిలిచిపోయిన వాహనాలు

రొద్దంలో ట్రాఫిక్ సమస్య

రొద్దం : రొద్దంలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజు రోజుకూ వాహనాల రాకపోకలు పెరుగుతుండడంతో ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్య తీవ్రమైనట్లు ప్రయాణికులు పేర్కొంటున్నారు. దీనికి తోడు శనివారం వారపు సంత ఉండడంతో దాదా పు 10 గ్రామాల ప్రజలు వస్తుంటారు. వారు ద్వి చక్ర వాహనాల్లో వచ్చి వాటిని ప్రధాన రోడ్డు పక్కనే నిలుపుతుంటారు. దీంతో వాహనాలు ఎదురెదురుగా వస్తే ట్రాఫిక్ స్తంభిస్తుందని ప్రజలు వాపోతు న్నారు. ముఖ్యంగా చావిడి వద్ద పూర్తిగా మలుపు ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలతో ముందుకు కదలలేక నిత్యం ట్రాఫిక్ సమస్య ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు. కావున అధికారులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



11 గంటలైనా తెరచుకోని సచివాలయం

వేళకు తెరచుకోని గ్రామ సచివాలయం

మడకశిర రూరల్: మండల పరిధిలోని గౌడనహళ్లి గ్రామ సచివాలయం శనివారం ఉదయం 11 గంటలైనా తెరచుకోకపోవడం పలు విమర్శలకు తావిచ్చింది. ఇది గమనించిన స్థానికులు సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్య వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే విషయమై గతంలో ఉన్నతాధికారులు హెచ్చరించినా సిబ్బంది పనితీరులో మార్పు రాలేదని మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందిం చి సచివాలయ సిబ్బంది వేళకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జగన్ దుష్టపాలనను అంతమొందిద్దాం

పరిటాల శ్రీరామ్



టిడిపిలో చేరిన వారితో పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

సీఎం జగన్ దుష్టపాలనను అంతమొందిద్దామని ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక మారుతీరాఘవేంద్రస్వామి కల్యాణ మండపంలో శనివారం పట్టణానికి చెందిన వైసిపి నాయకులు నాగశేషు, తలారి చంద్రమోహన్‌బాబు, అంకే దుర్గేశ్, శ్రీనివాసులుతో పాటు మరో 50 కుటుంబాలు టిడిపిలో చేరగా వారికి శ్రీరామ్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అంతకుముందు ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర చిత్రపటాలకు పూలమాల లు వేసి నివాళులర్పించారు. ధర్మవరం నియోజకవ ర్గం ప్రశాంతంగా ఉండాలంటే పరిటాల శ్రీరామ్‌తోనే సాధ్యమని పార్టీలో చేరిన వారు పేర్కొన్నారు. శ్రీరామ్ మాట్లాడుతూ కొత్తగా పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోనుగుంట్ల విజయకుమార్, చిగిచెర్ల ఓబిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ముత్యాలప్పనాయుడు, చింతపులుసు పెద్దన్న, పురుషోత్తంగౌడ్, గరుగు వెంగప్ప, మేకల రామాంజినేయులు, పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న బాబావలి

హిందూపురం : విద్యాసంస్థల్లో విద్యార్థు లకు అవసర మైన కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ బృందం శనివారం పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాల ను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ విద్యార్థులు కుర్చోవడానికి డెస్కులు ఏర్పాటు చేయడంతో పాటు పాఠ్య పుస్తకాలలు ఉచితంగా అందించాలని కోరారు. అలాగే జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, పరిష్కరించకపోతే ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో హర్షకుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు అవసరం

హిందూపురం : ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని విప్రో కేర్ వైద్యులు చక్రతేజారెడ్డి సూచించారు. మండల పరిధిలోని కొటిపి గ్రామంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ చిన్నపాటి రోగమే అని నిర్లక్ష్యం చేయవద్దన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి, ఆశ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపును ప్రతిఘటించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

రొద్దం : విద్యుత్ ఛార్జీల పెంపును ప్రతిఘటించాలని టిడిపి నాయకులు సూచించా రు. ఈ మేరకు శనివారం స్థానిక చావిడి వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో టిడిపి జిల్లా మహిళా అధ్యక్షులు సుబ్బ రత్నమ్మ, అధికార ప్రతినిధి నరసింహులు, పెనుకొండ నియోజకవర్గ అధ్యక్షులు చిన్నప్పయ్య, కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి ప్రజలు ఎక్కడికక్కడ ప్రతిఘటించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఫకృద్దీన్, తదితరులు పాల్కొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



అంగన్‌వాడీ కార్యకర్తలతో సిఐటియు నాయకులు

లేపాక్షి: అంగన్‌వాడీల సమస్యలపై జూలై 10, 11 తేదీల్లో కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న 36 గంటల నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయలని సిఐటియు నాయకులు పిరంగి ప్రవీణ్ కుమార్, లావణ్య పిలుపు నిచ్చారు. లేపాక్షిలో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ అంగన్‌వాడీలకు నిధులు పెంచాలి, సంక్షేమ పథకాలు అందజేయాలి, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాలు, తదితర డిమాండ్లపై కలెక్టరేట్ ముందు పగలు, రాత్రి 36 గంటల పాటు నిరసన కార్యక్రమం ఉం టుందని, జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ధనమ్మ, భాగ్యమ్మ, మాధవి, రత్నమ్మ పాల్గొన్నారు.

ఎంపిడిఒను కలిసిన జెడ్పీటీసీ

బత్తలపల్లి : ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించిన సౌజన్యకుమారిని శనివారం జడ్పిటిసి సభ్యురాలు కోటి సుధ, వైసిపి మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మండలాన్ని అభివృద్ధి పథం లో నడిపించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వారి వెంట బండి నాగభూషణ, ప్రకాష్, ప్రసాద్, బోయపాటి సూరి ఉన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బడా సుబ్బిరెడ్డి, తదితరులు

రైతు సమస్యలపై 30న మహాధర్నా

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి

ప్రజాశక్తి-తనకల్లు

రైతుల సమస్యలపై ఈ నెల 30వ తేదీ విజయవాడలో చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక రైతు భరోసా కేంద్ర కార్యాలయం వద్ద గోడపత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సుబ్బిరెడ్డి మాట్లాడుతూ నష్టపోయిన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ, పంట బీమా విడుదల చేయాలని, సున్నా వడ్డీ, పావలా వడ్డీ పథకాలకు నిధులు విడుదల చేయాలని, సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన నిధులు కేటాయించాలని, జాతీయ రహదారులు, రైల్వే, విద్యుత్ లైన్లు, పారిశ్రామిక కారిడార్లు, సోలార్ ప్రాజెక్టులకు భూములు కోల్పోతున్న రైతులకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పెద్దన్న పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

సామాన్యులకు విద్యుత్ షాక్ : సిపిఎం

ప్రజాశక్తి-పెనుకొండ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ బిల్లులతో సామాన్యుల నడ్డి విరుస్తున్నాయని సిపిఎం నాయకులు ధ్వజమెత్తారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు హరి మాట్లాడుతూ గతంలో విద్యుత్ పోరాటంలో కమ్యూనిస్టులు ప్రాత్యాగం చేసి పోరాడారని గుర్తుచేశారు. జగన్ ప్రతిపక్షంలో ఉండగా 'బాదుడే బాదుడు' అని రాగాలు తీసి, ఇప్పుడు కొత్త రూపంలో జనాన్ని బాదేస్తు న్నారన్నారు. మోడీ, జగన్ కలిసి సామాన్యుల నడ్డి విరుస్తున్నారని తెలిపారు. కార్పొరేట్ల దోపిడీని, ప్రభుత్వంలో అవినీతిని అరికడితే విద్యుత్ ఛార్జీలను తగ్గించవచ్చు అన్నారు. ప్రజలు మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిపిఎం మండల కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం సర్దుబాటు ఛార్జీల పేరుతో మూడు పోట్లు పొడిచిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై ప్రజలకు షాక్ ఇస్తున్నా యన్నారు. విద్యుత్ సమస్యలపై ఐక్యంగా ఉద్యమం సాగించాలని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంగాధర్, మహబూబ్ బాషా, వెంకటరాముడు, రాజురావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఓ తిప్పేనాయక్

ఒత్తిళ్లకు లొంగవద్దు : ఆర్డీవో

బత్తలపల్లి : ఓటరు జాబితా తయారీలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ఎలాంటి ఒత్తిళ్లకు లొంగవద్దని ధర్మవరం ఆర్డీఒ తిప్పేనాయక్ ఆదేశించా రు. స్థానిక ఎంపిడిఒ కార్యాల యంలో శనివారం ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ అనిల్‌కుమా ర్ అధ్యక్షతన బత్తలపల్లి, తాడిమర్రి మండలాలకు చెందిన బిఎల్ఒల తో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆర్డీఒతో పాటు ఆయా మండలాల తహశీల్దార్లు యుగేశ్వరీదేవి, నాగరాజు హాజరై మాట్లాడారు. ఓటరు జాబితా తయారీలో చిత్తశుద్ధితో వ్యవహరించా లన్నారు. ఇప్పటికే అవసరమైన శిక్షణ ఇచ్చానట్లు తెలి పారు. జూలై 20వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. తేదీల వారీగా చేపట్టాల్సిన అంశాలను వివరించారు. 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులను, నూతన ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు.

నూతన విద్యావిధానం డిగ్రీ విద్యార్థులకు వరం

ప్రజాశక్తి-హిందూపురం

నూతన విద్యావిధానం డిగ్రీ విద్యార్థులకు వరం అని ఉపాధ్యాయులు ఈశ్వర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బాలయేసు డిగ్రీ కళాశాలలో శనివారం నూతన విద్యావిధానంపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త విధానం విద్యార్థుల జీవితాల్లో మరింత వెలుగులు నింపుతాయన్నారు. దీనిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తన్వీర్, జియావుల్ల వివరించారు. కార్యక్రమంలో ఏఓ శౌరిరెడ్డి, కరస్పాండెంట్ బాలప్రతాపరెడ్డి, లైబ్రేరియన్ శివరామి రెడ్డి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

లేపాక్షి : మండల పరిధిలోని పులమితి గ్రామంలో బోయ హనుమంతు(45) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు.. హనుమంతు గతంలో చోళసముద్రం వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరి వేసుకొన్నాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం హిందూపురం ఆసుపత్రికి తరలించారు. అలాగే కేసు నమోదు చేశామని, పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు. హనుమంతుకి భార్య సజ్జక్క, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

బత్తలపల్లి: అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని యర్రాయపల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాలు.. చెన్నేకొత్తపల్లి మండలంలోని పెద్దమొగలాయిపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణ ద్విచక్ర వాహనంపై అనంతపురం వెళ్లి తిరిగి స్వగ్రామం వస్తుండగా అనంతపురం వైపు నుంచి బత్తలపల్లి వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామకృష్ణను స్థానికులు ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంత పురం తరలించారు. విషయం తెలిసిన వెంటనే బత్తలపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన బైక్‌ను స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు.

మట్కా బీటర్లు అరెస్ట్

కొత్తచెరువు : స్థానిక బుక్కపట్నం రోడ్‌లో ఉన్న శివాలయం వెనుక భాగంలో మట్కా రాస్తున్న ముగ్గురు వ్యక్తులను శనివారం అరెస్టు చేసినట్టు ఎస్సై లింగన్న తెలిపారు. కొత్తచెరువుకు చెందిన ఈడిగ శివతో పాటు మరో ఇద్దరు ఆన్‌లైన్‌లో మట్కా కార్యకలాపాలు నిర్వహిస్తుండగా దాడులు చేశామన్నారు. వారిని అదుపులోకి తీసుకొని రూ. 33,200 నగదు, మట్కా పట్టీలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరపరిచినట్లు ఎస్ఐ తెలిపారు. దాడుల్లో పోలీసులు జూలానాయక్, తదితరులు పాల్గొన్నారు

26న రాప్తాడు నియోజకవర్గంలో 'చైతన్య రథయాత్ర'



బస్సు యాత్ర ఏర్పాట్లను పరిశీలిస్తున్న పరిటాల సునీత

కనగానపల్లి : 'భవిష్యత్తుకు గ్యారెంటీ' పేరుతో టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి చేపట్టిన "చైతన్య రథయాత్ర" ఈ నెల 26వ తేదీ రాప్తాడు నియోజకవర్గంలో సాగనుంది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి పరిటాల సునీత ముఖ్య నాయకులతో కలిసి రాప్తాడు, రామినేపల్లి, గొందిరెడ్డిపల్లి, యర్రగుంట, బండమీదపల్లి, రాంపురం, కనగానపల్లి గ్రామాల్లో పర్యటించి యాత్ర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్సు యాత్ర సాగే రూట్‌లో బహిరంగ సభలు నిర్వహిస్తారని, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

30లోగా పందులను తరలించండి

హిందూపురం: ఈ నెల 30వ తేదీ లోగా పందుల పెంపకందారులు వారి పందులను పట్టణం నుంచి దూరంగా తరలించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ హెచ్చరిం చారు. కమిషనర్ శనివారం తన ఛాంబర్‌లో పందులపెంపకం దారులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పందులు సంచరించడం వల్ల అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని కావున పట్టణానికి దూరంగా తరలించాలని, లేనిపక్షంలో చర్యలు తప్ప వన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రాం భూపాల్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

టిడిపి బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నాగభూషణం

తనకల్లు : మండల పరిధిలోని కొక్కంటి క్రాస్‌కు చెందిన టిడిపి సీనియర్ నాయకుడు సోంపాల్యం నాగభూషణంను బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు ఆయన శనివారం తెలిపారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించి కందికుంట వెంకటప్రసాద్ సూచనల మేరకు తనను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆదేశించే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు శ్రమిస్తానని తెలిపారు. బిసి, ఎస్సీ, ఎస్టీల సమస్యలపై రాజీ లేని పోరాటాలు చేస్తానని తెలిపారు.

పాఠశాలలో ముళ్లపొదల తొలగింపు

మడకశిర: మండల పరిధిలోని కల్లుమర్రి ఉన్నత పాఠశాల ఆవరణలో పెరిగిన కంప చెట్లను శనివారం సర్పంచి నాగరాజు ఆధ్వర్యంలో తొలగించారు. పాఠశాల ఆవరణలో భారీగా ముళ్లకంపలు పెరగడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతుండడంతో సర్పంచి నాగరాజు జెసిబితో శుభ్రం చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణారెడ్డి, పిఇటి ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.



కంపలు తొలగిస్తున్న సర్పంచి నాగరాజు

సీఎం సహాయనిధి చెక్కులు పంపణీ

కదిరి టౌన్ : సీఎం జగన్ పేదల పక్షపాతి అని, గతంలో ఎన్నడూ లేనివిధంగా వైద్య రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి పేర్కొన్నారు. సీఎం సహాయనిధి నుంచి విడుదలైన చెక్కులను శనివారం ఎమ్మెల్యే పట్టణంలోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ రకాల జబ్బులతో బాధపడుతూ ఆరోగ్యశ్రీ కింద వర్తించినటువంటి జబ్బులకు సీఎం సహాయ నిధి నుంచి విడుదలైన రూ. 5.50 లక్షల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేశానన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి వసతులతో కూడిన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని ప్రతి పేదవారికి అందుబాటులోకి తెచ్చారన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

హిందూపురం : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు కేశవులు, సుప్రవీణ్, హరినాథ్, రామచంద్ర పేర్కొన్నారు. రూరల్ మండల పరిధిలోని లోటస్ ఎక్స్‌లెన్స్ పాఠశాలలో శనివారం సంస్థ ఛైర్మన్ నీలకంఠారెడ్డి, డైరెక్టర్ ప్రజీత్‌రెడ్డిల అధ్యక్షతన అఖిల భారత చిన్న పిల్లల వైద్యుల సమాఖ్య సౌజన్యంతో చిన్న పిల్లల వైద్యులచే 4, 5వ తరగతి విద్యార్థులకు ఆరోగ్యంపై వారి స్థాయికి తగిన విధంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా చిన్న పిల్లల వైద్యుల సమాఖ్య ఉపాధ్యక్షుడు డా .సుబ్బారావు, కార్యదర్శి డా. రామచంద్రరావు, ఉప కార్యదర్శి డా. మదన్ కుమార్, కోశాధికారి డా. సుప్రవీణ్, హరీష్ మాట్లాడారు. వర్చువల్ విధానం ద్వారా శ్రీనగర్ నుంచి డా. రేఖ హరీష్ విద్యార్థులకు వివరించారు.

రేపు డివిజన్ స్థాయి 'స్పందన'

హిందూపురం : హిందూపురం పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ హసీనా సుల్తాన, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ శనివారం తెలిపారు. స్పందనలో సబ్ కలెక్టర్‌తో పాటు డివిజన్ వ్యాప్తంగా ఉన్న అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు జరుగుతుందన్నారు.

ఎంఇఒకు సన్మానం

మడకశిర : ఎంఇఒగా బాధ్యతలు స్వీకరించిన నరసింహమూర్తిని శనివారం యుటిఎఫ్ మడకశిర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాలింగప్ప, టి.మూడ్ల గిరియప్ప, జోగప్ప ఆధ్వర్యంలో ఎంఇఒ శ్రీనివాసభాస్కర్ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షు లు భూతన్న, గుడిబండ మండల అధ్యక్షులు నరసింహప్ప ఇద్దరు ఎంఇఒలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంఇఒలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందిం చాలని, పేద విద్యార్థులకు పథకాలను అందించాలని, ఉత్తమ ఫలితాలు సాధించాలని యుటిఎఫ్ నాయకులను కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఈశ్వర్, నరసింహమూర్తి, ఓబన్న, రంగయ్య, దేవరాజు, నరసింహరాజు, వెంకటరాముడు, వెంకటరమణనాయక్, నంజప్ప,, సూర్యప్రకాష్, శామ్యుల్, పవిత్ర, జ్యోతి, రాధ, సురేష్, రమేష్, ఓబుళకృష్ణ, రామప్ప పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : నూతన ఎంఇఒగా బాధ్యతలు చేపట్టిన ప్రసాద్‌ను శనివారం గ్రీన్ భారత్ జిల్లా కార్యాలయంలో ఛైర్మన్ రెడ్డివారి శంకర నారాయణ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులు ఎంపిపి రమణారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, వైస్ ఛైర్మన్ తిప్పన్న, ఉపాధ్యాయులు వెంకటరత్నం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మూతబడిన పాఠశాలను తెరిపిస్తానని హామీ ఇచ్చారు. గ్రీన్ భారత్ ఛైర్మన్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఛాలెంజ్‌గా తీసుకొని ముందుకెళ్తున్నారని తెలిపారు. ప్రతి పౌరుడు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు.